క్లుప్తంగా

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జడ్జి తంగమణి



వృద్ధుల మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్ : మండలంలోని ఓబులాపురం గ్రామ సమీపంలోని శ్రీకాశిరెడ్డి నాయన వృద్ధాశ్రమాన్ని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్మన్ తంగమని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులను పలకరిస్తూ వారి యోగ క్షేమాలను జడ్జి అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో లభిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. ప్రతి మనిషికీ వృద్ధాప్యం తప్పనిసరి అని, వృద్ధులను ప్రతిఒక్కరూ గౌరవించాలని జడ్జి సూచించారు.

నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరణ

కోవెలకుంట్ల: స్థానిక ఎంఆర్సీ భవనంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీపతిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏపీయూస్ నిరంతరం పోరాటాలు చేస్తోందనారు. నాయకులు రాజయ్య, నాగేశుడు, మల్లికార్జున, సుగుణ, జహీరాబీ, సురేష్‌రెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, తిరుపతిరెడ్డి, సుధీర్,రమేష్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

న్యాయం చేయండి

డోన్ టౌన్ : రోడ్డు విస్తరణలో గృహాలు కోల్పోతున్న బాధితులందరికీ న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ విద్యాసాగర్‌కు చిన్నమల్కాపురం గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. డోన్ యు.కొత్తపల్లె నుంచి బేతంచెర్ల మండలంలోని కర్నూలు –చిత్తూరు జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న జాతీయ రహదారి వెడల్పులో 156 గృహాలు కోల్పోతుండగా కేవలం 133 ఇళ్లనే అధికారులు గుర్తించారని సర్పంచ్ లక్ష్మీప్రసన్న, వైస్ సర్పంచ్ రాజేశ్వరరెడ్డి తదితర గ్రామస్తులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు సిద్ధరంగప్ప, రామలక్ష్మమ్మ, దశరథుడు, మద్దయ్య, నాగవేణి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

డోన్ టౌన్ : ఏపీఎస్ఎస్‌డీసీ, శ్రీ టెక్నాలజీ ఆధ్వర్యంలో యువతి యువకులకు కంప్యూటర్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఎస్వీ నైస్ కంప్యూటర్స్ నిర్వాహకుడు రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, టెలికాం కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో రెండు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. పదవ తరగతి పాసై 35 వయసులోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 10వ తేదీలోపు పట్టణంలోని శ్రీరామ్ థియేటర్ ఎదురుగా ఉన్న కార్తికేయ గానుగ ఆయిల్ పైన ఉన్న ఎస్వీ నైస్ కంప్యూటర్ కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి శివరామ్ టాకీస్ నుంచి ఈద్గా నగర్ వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కార్యక్రమానికి హాజరై నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ ఎంపీటీసీ, సర్పంచ్ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

డోన్ రూరల్: మండల పరిధిలోని కొత్తకోట గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై మంగళవారం గుండెపోటుతో అమీన్ అగర్వాల్(50) మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు పాస్‌పోర్ట్ పని మీద కారులో వెళ్తుండగా కొత్తకోట వద్ద గుండెపోటు రావడంతో కారు డివైడర్‌ను ఢీకొంది. అప్పటికే అతను మృతి చెందాడన్నారు. అయనతో పాటు ఉన్న హేమలతకు ఎటువంటి గాయాలు కాలేదన్నారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు బెంగుళూరులోని ఏర్‌పోర్ట్ నందు మేనేజర్‌గా పనిచేస్తాడన్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

5నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

కొలిమిగుండ్ల: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5వ తేదీ నుంచి మండలంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయికృష్ణ తెలిపారు. 5న గొర్విమానుపల్లె, 9న తిమ్మనాయినపేట, 19న చింతలాయిపల్లె, 27న తోళ్లమడుగు గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్నామని చెప్పారు. మెడికల్ క్యాంపుల్లో స్పెషలిస్టు వైద్యులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్యాపిలి: మండలంలో ఈ నెల 5 వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 21 వ తేదీ వరకు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వైద్య నిపుణులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. అదేవిధంగా వ్యాధి తీవ్రత మేరకు పెద్ద ఆసుపత్రులకు సిఫారసు చేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అండగా నిలిచిన ప్రభుత్వాన్ని....

ఆశీర్వదించండి !

- ప్రతి హామీ అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే
- అవ్వా, తాతలకు రూ. 3 వేల పింఛన్ అందజేస్తున్న సీఎం
- పింఛన్ల పెంపు వారోత్సవాల్లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



లబ్ధిదారులకు రూ. 3వేల పెంఛన్లను అందజేసిన ఎమ్మెల్యే

కోవెలకుంట్ల: పార్టీలు, కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసి అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక వీఆర్, ఎన్ఆర్ ఫంక్షన్ హాలులో మంగళవారం పింఛన్ల పెంపు వారోత్సవాలను నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు గోపిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, మేజర్‌గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ దిల్కా బాషా, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, సచివాలయ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కష్ట, నష్టాలను స్వయంగా తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇచ్చి పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. రూ. 8.50 కోట్లతో వీలైనంత త్వరలో అవుకు రిజర్వాయర్ నుంచి కోవెలకుంట్ల పట్టణానికి తాగునీటిని సరఫరా చేయబోతున్నామన్నారు. 2019 నాటికి కోవెలకుంట్ల మండలంలో 5013 పింఛన్లు ఉండగా ప్రస్తుతం 6119 మందికి పింఛన్లు అందుతున్నాయన్నారు. ఈ ఒక్క ఏడాదిలోనే 343 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అనంతరం కొత్త పింఛన్‌దారులకు రూ. 3వేల పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాల మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు భీమిరెడ్డి ప్రతాప్ రెడ్డి, డీవీశేషిరెడ్డి, శ్రీనివాసనాయక్, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి, అబ్దుల్ సత్తార్, అక్బర్‌బాషా, జోళదరాశి సుబ్బరాయుడు, ఎంపీడీఓ సయ్యదున్నీసా, తహసీల్దార్ పుష్పకుమారి, ఈఓపీఆర్‌డీ రాధిక, మేజర్‌గ్రామ పంచాయతీ ఈఓ గోపీనాథ్, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

హామీలన్నీ నెరవేర్చిన జగనన్న

సంజామల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విలువలకు కట్టుబడి ఉంటుందని, పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. మండల కేంద్రం సంజామల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పింఛన్ పెంపు వారోత్సవాలు కార్యక్రమంలో ఎంపీపీ పోచా రమాదేవి, కర్నూలు ఉమ్మడి జిల్లాల ప్రచార విభాగ జోనల్ ఇన్‌చార్జ్ పోచా శీలారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్య ప్రకాష్ రెడ్డితో కలసి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి లబ్ధిదారులకు రూ. 3వేలు పింఛన్ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల ఆర్థిక పరిస్థితి మెరుగు పడిందన్నారు. మండలంలో 5,359 పింఛన్లు ఉన్నాయని, వాటికి రూ.1,58,67,000 సొమ్ము లబ్ధిదారులకు అందిందాన్నరు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి రూ. లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధిచేరిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిన్నబాబు, రాజశేఖర్ రెడ్డి, నాయకులు బత్తు రామ చంద్ర రెడ్డి, గోరిగారి కిరణ్‌కుమార్‌రెడ్డి, గోరిగారి నాగేశ్వర్ రెడ్డి, పోచా వెంకట్రామిరెడ్డి, అసదుల్లా ఖాన్, దేశాక్ రెడ్డి, సత్యమయ్య, అల్వకొండ బాబు తదితరులు పాల్గొన్నారు.

మీ ఇంటికి మంచి జరిగిందా... లేదా!

కొలిమిగుండ్ల: జగనన్న ప్రభుత్వంలో మీ ఇంటికి మంచి జరిగిందా... లేదా అని ఆలోచించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలువాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం కొలిమిగుండ్లలోని షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో పింఛన్ మహోత్సవాల్లో భాగంగా లబ్ధిదారులకు రూ.3వేల పింఛన్ సొమ్మును వారు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతు నాలుగు విడతలుగా పింఛన్ సొమ్మును పెంచుకుంటూ పోతామని ఇచ్చిన హామీని సీఎం జగన్ అమలు చేసి చూపించారని కొనియాడారు. కొలిమిగుండ్ల మండలంలో 7,263 పింఛన్లకు ప్రతి నెలా రూ.2.17 కోట్లకు పైగానే పంపిణీ జరుగుతుందన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేదుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి, ఎంపీడీఓ సాయికృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు క్రిష్ణారెడ్డి, దస్తగిరి, సీనియర్ నాయకుడు సత్తిగారి రామిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ

డోన్ రూరల్ : మండల పరిధిలోని దేవరబండలో మంగళవారం ఎంపీటీసీ మహేశ్వరమ్మ, గ్రామ సర్పంచ్ పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు సర్వోత్తంరెడ్డి, మధుసుదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెంచిన రూ. 3 వేల పింఛన్‌ను పంపిణీ చేశారు.

చాలా సంతోషంగా ఉంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాలాంటి వృద్ధులకు చాలా మేలు చేస్తుంది. మాకే కాదు... ప్రజలు కూడా ఇబ్బంది పడకుండా ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న తీరు చాలా బాగుంది. నాకు రెండు సంవత్సరాలుగా పింఛన్ వస్తుంది. ప్రతి నెలా రూ.2750 వచ్చేది. కానీ పింఛన్ పెంచడంతో రూ.3000 అయ్యింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–అల్లాబకాష్, ముక్కమల్ల గ్రామం

జగన్‌బాబు... పెద్ద కొడుకుతో సమానం



గతంలో పింఛన్ తీసుకోవాలంటే చావిడి వద్దకు వెళ్లి తెచ్చుకునేవాళ్లం. ఎప్పుడు వస్తారో.. రారో కూడా తెలియక నిరీక్షణ తప్పేది కాదు. ఇప్పుడు తెల్లవారు జామునే వలంటీర్లు ఇంటి వద్దకు తెచ్చి ఇస్తున్నారు. ముసలోళ్లు ఇబ్బందులు పడకుండా బాగా చేశాడు. ప్రతి ఇంటికి జగన్ పెద్ద కొడుకులా ఉన్నాడు. పింఛన్ రూ.3వేలు పెంచడంతో చాలా సంతోషంగా ఉంది. ఎవరూ ఎన్ని చెప్పినా... మా ఓట్లు జగన్‌కే వేస్తాం.

– వెంకట లక్ష్మమ్మ,బెలుం

అలాగే యాపదిన్నె గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు నరసింహరెడ్డి ఆధ్వర్యంలో, కమలాపురం గ్రామంలో సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పింఛన్ పంపిణీ చేశారు.

టీడీపీ కుట్రలను తిప్పకొట్టండి

ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలని టీడీపీ కుట్ర రాజకీయాలకు పాల్పడుతుందని, తిప్పికొట్టాలని ఎమ్మెల్యే కాటసాని ప్రజలకు పిలుపునిచ్చారు. పింఛన్ వారోత్సవాల్లో భాగంగా కోవెలకుంట్ల, సంజమాల, కొలిమిగుండ్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో టీడీపీ తీరుపై ఎమ్మెల్యే కాటసాని మండిపడ్డారు. గత టీడీపీ హయాంలో చంద్రబాబు 600లకు పైగా హామీలు ఇచ్చి ఏ ఒక్కటి అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశాడన్నారు. రుణమాఫీ పేరుతో రైతులు, డ్వాక్రా మహిళలను నయ వంచనకు గురి చేశాడని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని మోసపూరిత హామీలతో ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. ప్రజలు పచ్చ నాయకుల ప్రలోభాలను నమ్మొద్దన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేసినా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి కన్పించడం లేదని ఎద్దేవా చేశారు. ప్రజలకు మేలు జరగకుండా కోర్టులకు వెళ్లి ఇంటి స్థలాలు, భూ పంపిణీని అడ్డుకున్న బీసీ జనార్దన్‌రెడ్డి... ఏమీ జరగలేదని అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఐదేళ్ల పాటు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఏనాడైనా ప్రజలకు మంచి పని చేశారా అని ప్రశ్నించారు. మళ్లీ అధికార కాంక్షతో ప్రజలను మోసగించేందుకు వస్తున్నారని అన్నారు. తాము అధికారంలోకి చేపట్టే కార్యక్రమాలు చెప్పుకుంటారని, టీడీపీ నాయకులు మాత్రం ఇందుకు విరుద్ధంగా తాము అధికారంలోకి వస్తే కేసులు పెడుతాం, జైలుకు పంపుతాం. అంతు చూస్తామని బెదిరింపులు పాల్పడుతున్నారన్నారు. అసత్యప్రచారాలకు పాల్పడుతున్న టీడీపీ నాయకులకు మరోమారు గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు.

చెప్పాడంటే... చేస్తాడంతే

- మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు



పింఛన్ రూ. 3వేల అందజేస్తున్న రాష్ట్ర మీట్‌కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్ రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఏమి చెప్పినా చేస్తారని, అవ్వ, తాతలకు పింఛన్ రూ. 3 వేలు పెంచి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్న మల్కాపురం గ్రామంలో ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం మూడు వేల రూపాయలు పింఛన్ అందించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాష్ట్ర మీట్ కార్పోరేషన్, ఎంపీపీ లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. ముందుగా సంక్షేమ పథకాల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చాలని ఉద్దేశంతో ఈ రోజు ఏకంగా మూడు వేల రూపాయల పింఛన్ చేశారన్నారు. అదేవిధంగా కుల, మతా, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందజేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. మంత్రి బుగ్గన్న రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో డోన్‌ను రూ. 2,400కోట్లతో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజ్ కుమార్‌యాదవ్, మండల అధ్యక్షుడు రామచంద్రుడు, ఉప సర్పంచ్ రాజేశ్వరరెడ్డి, నాయకులు బద్దలనాగరాజ్, హనుమంతురెడ్డి, దాస్, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి బుగ్గన ప్యాపిలికి రాక

ప్యాపిలి: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం ప్యాపిలి వస్తున్నారని వైఎస్సార్‌సీపీ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. పట్టణంలో ఆధునీకరించిన ఆర్అండ్‌బీ అతిథి గృహం, పార్కును మంత్రి ప్రారంభిస్తారన్నారు. అలాగే స్థానిక పట్టు పరిశ్రమ కేంద్రంలో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని మంత్రి ప్రారంభిస్తారు. మంత్రి పర్యటనను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీని ఆదరించండి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఎం శశిభూషణ్

డోన్ టౌన్ : ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా పని చేస్తున్న ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆదరించాలని డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ కోరారు. స్థానిక కొత్త బస్టాండ్‌లో మంగళవారం గతేడాది డిసెంబర్ నెలకు సంబంధించి లక్కీడిప్ తీశారు. మొదటి, రెండవ, మూడవ ప్రోత్సాహక బహుమతులు వరసగా నేలతలమర్రి గ్రామానికి చెందిన రంగస్వామి, కర్నూలులోని సంతోష్‌నగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం, కర్నూలుకు చెందిన అలిపీరాను వరించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ పల్లె వెలుగు ప్రయాణికులను ప్రోత్సహించేందుకు నెలలో రెండు పర్యాయాలు లక్కీ డిప్ తీసి బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం డోన్ కర్నూలు రూట్‌లో అమలు చేస్తున్నామని, ప్రయాణికులు బస్సు దిగిపోయేప్పుడు వారి టిక్కెట్ వెనుక పేరు సెల్ నంబరు రాసి డ్రైవరు వెనుక ఉన్న బాక్స్‌లో వేయాలని సూచించారు.

మంత్రిని కలిసిన లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు



మంత్రి బుగ్గనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

బేతంచెర్ల: మండల లారీ ఓనర్స్, పట్టణ కిరాణ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు, ముస్లిం మైనార్టీ సోదరులు మంగళవారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్థానిక స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, కొండా రెడ్డి, తెలుగు మద్దయ్య, అంబాపురం మద్దిలేటి, నాగరాజు, నాగేంద్ర, తిరుమల శ్రీను, కుమ్మరి శ్రీను, కిరాణ మర్చంట్ అసోసియస్ అధ్యక్ష, కార్యదర్శులు గుండా జగన్, శ్రీధర్, సురేష్, ముస్లిం మైనార్టీ సోదరులు ఖాజా హుసేన్, సయ్యద్, మా బాషా తదితరులు మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గాలికుంటువ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె : పశువులకు సోకే గాలికుంటు వ్యాధి పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె పశువైద్యశాల సహాయ సంచాలకులు(ఏడీఏ) డాక్టర్ మారుతిసకారమ్ పేర్కొన్నారు. పట్టణంలోని కొండపేటలో మంగళవారం గాలికుంటు టీకా కార్యక్రమాన్ని ఏడీఏతో పాటు పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ బనగానపల్లె ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలోని బనగానపల్లె, అవుకు మండలాలకు 45,900 డోసుల వ్యాక్సిన్ వచ్చిందని, ఈ నెల 31వ తేది వరకు ప్రతి గ్రామంలో ప్రతి పశువుకు టీకాను వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు బ్రహ్మానందరెడ్డి, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఖురేషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పశువులకు సోకే గాలికుంటు వ్యాధిపట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి కృష్ణకుమార్ తెలిపారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా మండలంలోని ఆయా గ్రామాల్లో గాలికుంటు వ్యాధి ప్రబలకుండా టీకాలు వేసే కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు కోవెలకుంట్ల పట్టణంలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం



ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న డివిజన్ వైద్య అధికారి చెన్నకేశవులు



అంబాపురంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం



వృద్ధురాలికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సోహెల్‌బాబు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

డోన్ రూరల్ : ప్రజారోగ్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని, ఇళ్ల వద్దకే వైద్య సేవలు అందజేస్తుందని డివిజన్ వైద్య అధికారి చెన్నకేశవులు, ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని ఎర్రగుండ్లలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. వైద్యనిపుణులు 472మందికి ఆరోగ్య పరీక్షలు చేసి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్నమల్కాపురం పీహెచ్‌సీ వైద్యులు హరికుమార్, హెల్త్ సూపర్‌వైజర్ చెన్నయ్య, ఎంపీహెచ్‌ఈఓ ప్రభాకర్, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, సూపర్‌వైజర్‌విజయలక్ష్మి, సరోజమ్మ, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీఓ వెంగన్న, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, ఉప సర్పంచ్ మద్దిలేటి స్వామి, మాజీ సర్పంచ్ యాదగిరి వెంకటేశ్వర్లు, నాయకుడు చంద్ర శేఖర్ రెడ్డి ప్రారంభించారు. డాక్టర్లు సాగరిక, వెంకటేశ్వర్లు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

బనగానపల్లె రూరల్ : ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శివరామయ్య, సర్పంచ్ బండి వరలక్ష్మి, గ్రామ వ్యవసాయసలహా మండలి చైర్మన్, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు బండిబ్రహ్మానందరెడ్డి తెలిపారు. మండలంలోని యాగంటిపల్లె సచివాలయంలో ఏర్పాటు చేసిన రెండవ విడత ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వారు ప్రారంభించారు. 520 మందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు, ఈసీజీ తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సోహైల్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు రాజేష్, జగదీశ్వరరెడ్డి, పంచాయతీకార్యదర్శి స్వర్ణలత పాల్గొన్నారు.

అవుకు: ప్రజల ఆరోగ్య శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక కార్యక్రమాలను చేపడుతున్నారని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం అవుకు రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మీ వైద్య శిబిరాన్ని పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్లు వినోద్‌కుమార్, యమునా, జనరల్ ఫిజిషియన్ శ్రీనాథ్ రెడ్డి, జనరల్ సర్జన్ రసూల్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్ నజీమాలు ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఈఓ అశ్విన్ కుమార్, సర్పంచ్ మందా గుర్రమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురి వ్యక్తులను మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు. మాజీ ఉపసర్పంచ్ సదా శివారెడ్డి, సంఘం శంకర్‌రెడ్డి, మాజీ వార్డు మెంబర్ జంబులమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవలే ఇళ్లకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. అలాగే పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మురళీకృష్ణ సోదరి అక్కమ్మ అనారోగ్యంతో మృతి చెందగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించిన వారిలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జున రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, దశరథరామిరెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి, గజ్జెలరెడ్డి తదితరులు ఉన్నారు.

యాగంటి ఆలయానికి మైక్‌సెట్, కంప్యూటర్ విరాళం

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం బనగానపల్లె కెనరా బ్యాంకు శాఖ ప్రతినిధులు 400 డబ్బా యాం ప్లిఫైర్లు, ఆరు మైక్‌సెట్లు, కంప్యూటర్ సామాగ్రిని విరాళంగా అంద జేశారు. కెనరా బ్యాంకు ఆర్ఎం అనంత పద్మనాభరావు బనగానపల్లె మేనేజర్ ప్రమోద్‌కుమార్ నాయక్‌తో కలిసి ఈఓ. చంద్రశేఖర్‌రెడ్డి,చైర్మన్ తొటబుచ్చిరెడ్డిలకు ఈ పరికరాలను అందజేశారు.

విద్యుదాఘాతంతో దుకాణం దగ్ధం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని నాయినపల్లె ప్రధాన రహదారి పక్కలో ఉన్న దుకాణంతో పాటు రేకుల షెడ్డు మంగళవారం అగ్నికి ఆహుతి అయ్యింది. గ్రామానికి చెందిన బోయ వెంకటస్వామి, సుబ్బక్క దంపతులు రోడ్డు పక్కనే నిత్యావసర సరుకుల దుకాణంతో పాటు చిన్న హోటల్ నిర్వహిస్తున్నారు. తెల్లవారు జామున విద్యుదాఘాతంతో ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో డ్వాక్రా రుణం బ్యాంక్‌లో చెల్లించేందుకు దాచుకున్న రూ.70 వేలతో పాటు రిఫ్రిజిరేటర్, నిత్యావసర సరుకులు,ఇతర సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, డీటీ నాగేశ్వరరెడ్డి, వీఆర్వో ప్రసాదరెడ్డి కాలిపోయిన దుకాణాన్ని పరిశీలించారు. బాధితులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా కల్పించారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కళాశాలకు హాస్టల్ మంజూరు చేయించండి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హాస్టల్ మంజూరు చేయించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు,అధ్యాపక బృందం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని కలిసి విన్నవించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జెడ్పీచైర్మన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కళాశాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ముఖ్యంగా బాలికలు వస్తుంటారని ప్రిన్సిపాల్ చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి హాస్టల్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని జెడ్పీ చైర్మన్ హామీ ఇచ్చారు.

యాగంటి క్షేత్రంలో షూటింగ్

బనగానపల్లె రూరల్ : మండల పరిధిలోని యాగంటి క్షేత్రంలో మంగళవారం సామజవరగమన చిత్రం హీరో శ్రీవిష్ణు, హీరోయిన్ రీతూవర్మ నటించిన కొత్త చిత్రానికి సంబంధించిన షూటింగ్ జరిగింది. పీపుల్స్ మీడియా గ్రూపు బ్యానర్‌పై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తుండగా దర్శకత్వం అషిక్‌వలి వహిస్తున్నారు. హీరో, హీరోయిన్‌ల కుమారుడికి సంబంధించి నామకరణం సన్నివేశాలను చిత్రీకరించారు.

హీరో కారును అడ్డుకున్న కూలీలు

సినిమా షూటింగ్‌లో పాల్గొన్న కూలీలు సాయంత్రం షూటింగ్ పూర్తయ్యాక వేతనం ఇవ్వలేదని ఆవరణలో ఆందోళన వ్యక్తం చేశారు. యాగంటిపల్లెతో పరిసర గ్రామాలకు చెందిన సుమారు 400 మంది షూటింగ్‌లో పాల్గొన్నారు. రాత్రి షూటింగ్ పూర్తి చేసుకొని కారులో వెళ్తున్న హీరో శ్రీ విష్ణు కారు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని వేతనానికి హీరోకు ఎలాంటి సంబంధం లేదని సర్దిచెప్పారు. చిత్ర యూనిట్ సభ్యులతో కూలీలకు వేతనం ఇప్పించే ఏర్పాట్లు చేశారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

అవుకు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు అవుకు మండలంలో జోరుగా సాగుతున్నాయి. అవుకు–2తో పాటు, మంగంపేట, చనుగొండ్ల, రామాపురం–2, కునుకుంట్ల గ్రామాల్లో మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్ ఆటల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. నోడల్ అధికారులు తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు, ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి, ఎంఈఓ శ్రీధర్ రావు, నాయకులు పురుషోత్తం నాయుడు, వల్లపురెడ్డి రామిరెడ్డి పాల్గొన్నారు.